నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, బుధవారం 12 మార్చి 2025 | JANAGAON

యాసంగిల వంద మోటర్లు అల్లిన

కాలిన మోటర్ అల్లుతున్న మెకానిక్ రాజు

దేవరుప్పుల : నీళ్లు లేక మోటర్లు కాలుతున్నయ్. ఇన్నేండ్లు గిరాకీ లేకుండె. ఈ యాసంగిల వంద మోటర్లు కాలితే అల్లిన. కరెంటు తేడా వస్తుంది. మోటర్లు వేడెక్కి కాలుతున్నయ్. నేను కాంగ్రెస్ పార్టే కానీ, ఏ మాటకామాటే.. కేసీఆర్ పాలనే బాగుండె. ఇక్కడ దయాకర్‌రావు పనులు చేసేది. మార్పు కోరితే మంచి జరుగుతదనుకుంటే అంతా ఆగమాగమే అయితాంది. నాకు గిరాకీ వస్తుంది గాని రైతులు నీళ్లు లేక మోటర్లు కాలి మొత్తుకుంటుండ్రు. – *గుగులోతు రాజు, మోటర్ మెకానిక్, దోనెబండ తండా, దేవరుప్పుల మండలం*

ఏడాదిన్నర కిందటి వరకు గోదావరి జలాలతో కళ కళ లాడిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జలాశయాలు నేడు చుక్క నీరు లేక ఎండిపోయాయి. మండు వేసవిలోనూ మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు ఎండాకాలం ప్రారంభంలోనే నీళ్లు లేక నెర్రెలు బారగా.. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. ఫలితంగా బోర్లు, బావులు నిరుపయోగంగా మారాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అస్తవ్యస్తంగా మారింది. ఎస్సారెస్పీ, దేవాదుల కాల్వల ద్వారా చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపని కాంగ్రెస్ ప్రభుత్వ పాపం.. రైతులకు శాపంగా మారింది. నీళ్లుండీ ఇవ్వలేని సర్కారు అసమర్థ పాలన పదేళ్ల కిందటి సాగు కష్టాలను తెచ్చిపెట్టింది. ఉమ్మడి జిల్లాలోని వాగుల్లోకి సైతం గోదావరి జలాలు రాక వట్టిపోవడంతో యాసంగిలో లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలు సాగునీరందక ఎండిపోతున్నాయి. పలుచోట్ల పొట్ట దశకు వచ్చిన వరి, కంకి పెడుతున్న మక్కజొన్న కళ్ల ముందే మాడిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. వాగుల పరీవాహక ప్రాంత రైతులు మూకుమ్మడిగా గుంతలు తీసి మోటర్ల ద్వారా నీరు పారించేందుకు యత్నిస్తున్నారు. అడుగంటిన బావుల్లో పూడికతీస్తున్నారు. దీనికి తోడు కరెంట్ కోతలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. వచ్చి పోయే విద్యుత్‌తో మోటర్లు కాలిపోతుంటే వాటికి మరమ్మతులు చేసి తిరిగి బిగిస్తున్నారు. అయినప్పటికీ ఒక్కమడి పారకపోవడంతో చేసేదేమీ లేక పలువురు రైతులు పంటను పశువులకు మేతగా వదిలేస్తుండగా.. ఆశ చావని మరికొందరు వేసవికాలమైనా వానదేవుడు కరుణిస్తాడేమోనని మొగులు వైపు చూస్తున్నారు. అష్టకష్టాలు పడినప్పటికీ చివరికి వేలాది రూపాయలు ఖర్చుచేసి సాగుచేసిన పంట చేతికొస్తుందో.. లేదోనని దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు. సాగునీరు లేక పంటలు ఎండుతున్న పరిస్థితిపై 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో మంగళవారం పర్యటించి రైతులను పలుకరించింది. పంటను కాపాడుకునేందుకు వారు పడుతున్న కష్టాలను కళ్లారా చూసింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువని మండిపడ్డారు. తమ నీటి సమస్యను పట్టించుకోని స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్ణయుగంలా సాగిన కేసీఆర్ పదేళ్ల పాలనను గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. - నమస్తే నెట్‌వర్క్, మార్చి 11

చిల్పూర్ మండలం బోడబండ తండాలో అడుగంటిన చెరువు

కాంగ్రెస్ పాపం.. రైతుకు శాపం

నీళ్లుండీ ఇవ్వలేని దుస్థితిలో రేవంత్ సర్కారు

కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగం

- చెరువులు, కుంటలకు చేరని గోదావరి జలాలు
- ఉమ్మడి జిల్లాలో అడుగంటిన జలాశయాలు
- భారీగా పడిపోయిన భూగర్భ జలమట్టాలు
- నిరుపయోగంగా మారుతున్న బోర్లు, బావులు
- చుక్క నీరు లేక వట్టిబోయిన పలు వాగులు
- సాగునీరందక ఎండుతున్న యాసంగి పంటలు
- కాపాడుకునేందుకు అన్నదాత పడరాని పాట్లు

నెల్లికుదురు–బ్రాహ్మణకొత్తపల్లి గ్రామల మధ్యనున్న ఆకేరువాగులో సాగునీటి కోసం రైతులు జేసీబీ సాయంతో తవ్వించిన గుంతలో ఏర్పాటు చేసుకున్న మోటర్లు

గుంతలు తీసి.. పంటకు నీళ్లు

అరిగోస పడుతున్న ఆకేరు వాగు పరీవాహక రైతులు

నెల్లికుదురు : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, కాచికల్, బ్రాహ్మణకొత్తపల్లి, మునిగలవీడు, మదనతుర్తి గ్రామాల రైతులు ఆకేరువాగు నీటిని సాగు కోసం వినియోగించుకుంటారు. అయితే గత పదేళ్లలో ఏనాడూ ఎండిపోని ఆకేరువాగు ఈ ఏడాది మార్చి ప్రారంభానికే అడుగంటింది. వాగు మొత్తం ఎండిపోవడంతో దీని పరీవాహక ప్రాంతంలో సాగు చేసిన పంటలకు సాగు నీరు లేక రైతులు అరిగోస పడుతున్నారు. పంటలను కాపాడాకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో బ్రాహ్మకొత్తపల్లి రైతులు జేసీబీ సాయంతో ఆకేరు వాగులో పెద్ద గుంత తవ్వించి దానిలో సుమారు 50 మోటర్లు ఏర్పాటు చేసుకొని పంటలకు సాగునీరందించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు తమకేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సాగునీటి సౌకర్యం కల్పించి ఎండుతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

దేవరుప్పుల మండలం పెదతండాలో నీళ్లు రాక ఎండిపోయిన కెనాల్

బచ్చన్నపేట మండలంలోని ఆలీంపూర్‌లో ఎండిపోయిన చెరువు

కళ్లముందే నెర్రెలు బారుతున్నది..

నెర్రెలు బారిన పొలాన్ని చూపుతున్న రైతు ఎల్లయ్య

కాటారం : మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లి గ్రామం. గ్రామంలోని చింతల చెరువు కింద నాకున్న ఎకరంతోపాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేసిన. 20 రోజులుగా పంటకు నీరందక ఎండిపోతుంది. నిరుడేమో చెరువు నిండా నీళ్లుంటే ఏర్పడలేదు. ఇప్పుడు నీళ్లు లేక మళ్లీ మాకు కష్టాలు రావట్టే. కళ్లముందే పొలమంతా బీటలు పారుతుంటే ముద్ద నోట్లోకి పోతలేదు. ఈ పంట చేతికి రాకపోతే చేసిన అప్పులు ఎట్ల తీరుతాయోనని ఇప్పటిసందే దిగులు మొదలైంది. – *డొంగిరి ఎల్లయ్య, రైతు, గారెపల్లి, కాటారం మండలం*

నెల రోజులు చలివాగును ఎండబెట్టిండ్రు

- కాంట్రాక్టర్‌కు రూ.5 కోట్ల బిల్లులియ్యలేదు..
- ఇక్కడ పంటలను ఎండబెట్టి ధర్మసాగర్‌కు నీటిని తరలిస్తే ఊరుకోం
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- దేవాదుల పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

చలివాగు పంప్‌హౌస్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, మార్చి 11 : కాంట్రాక్టర్లకు బిల్లులియ్యక చలివాగు ప్రాజెక్టులోకి నెల రోజుల పాటు నీటి పంపింగ్ జరగలేదని, దాంతో నీటి సమస్య తీవ్రమై పంటలు ఎండిపోతున్నాయని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని దేవాదుల పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్మసాగర్‌కు పంపింగ్ బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ముందుగా దేవాదుల సీఈ అశోక్‌కుమార్‌కు ఫోన్ చేసి గండ్ర మాట్లాడారు. చలివాగు ప్రాజెక్ట్‌లో కనీసం 15 అడుగుల నీటిమట్టం ఉంచిన తర్వాతే ధర్మసాగర్‌కు నీటి సరఫరా చేయాలని సూచించారు. అట్ల కాదని ఇక్కడి పంట పొలాలను ఎండబెట్టి పైకి నీరు తీసుకెళ్లాలనుకుంటే చూస్తూ ఊరుకోమని, మోటర్లు బంద్ పెడతామని హెచ్చరించారు. ఇక్కడికి ఈఈని పంపించి హామీ ఇప్పించాలని సూచించారు. కొద్ది సేపటికి ఈఈ సునీత వచ్చి ఆరు రోజుల్లో పదిహేను అడుగులకు నీటిని ఉంచుతామని పేర్కొనడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జనవరిలో నెల రోజుల పాటు చలివాగు ప్రాజెక్ట్‌లోకి నీటి పంపిణీ జరగలేదన్నారు. కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన రూ.5కోట్ల బిల్లు చెల్లించకపోవడంతో సిబ్బంది జీతాలు ఇవ్వకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనికరం చూపించడం లేదన్నారు. చలివాగు ప్రాజెక్టులో ప్రస్తుతం పది అడుగుల నీటిమట్టం మాత్రమే ఉందన్నారు. చలివాగులో నీటి మట్టం 15 అడుగులకు పెరిగే వరకు మోటార్లు బంద్ పెట్టాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను చూడలేక ఆందోళన చేపట్టామన్నారు. స్థానిక ఎమ్మెల్యే అసమర్థత స్పష్టంగా కనిపిస్తుందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మోటర్లు బంద్ పెట్టి చలివాగు ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేశామని తెలిపారు. ఇక్కడి పొలాలను ఎండబెడితే ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని, లేకపోతే ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. వారం రోజుల్లో 15 అడుగులకు నీటిమట్టం ఉంచి పై నీటినే ఎగువకు పంపింగ్ చేయాలని, లేకపోతే రైతు పక్షాన ఉద్యమించి తాళాలు పగులగొట్టయినా మోటర్లు బంద్ చేస్తామని హెచ్చరించారు. రైతులతో రాజకీయం చేయాల్సిన అవసరం తనకు లేదని, చలివాగు ఆయకట్టులో పొలాలు ఎండకుండా చూడాలన్నదే లక్ష్యమన్నారు. చలివాగు ఆయకట్టు వెంట చిట్యాల, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల వరకు వరి పంట పొట్ట దశలో ఉందని, అందరూ కూడా రైతులేనని, ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకొని తూము ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని గండ్ర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మేకల శ్రీనివాస్, దైనంపెల్లి సుమన్, గంటా శ్యాంసుందర్‌రెడ్డి, అరికిల్ల ప్రసాద్, కొమ్ముల శివ, గాజె రాజేందర్, శాయంపేట, గోరికొత్తపల్లి, రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొండపర్తి ఆదర్శంగా నిలువాలి

- రాష్ట్రంలో 7 ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి
- దత్తత గ్రామ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మేడారం వనదేవతలకు ప్రత్యేక పూజలు

మహిళలకు కట్టు మిషన్‌ను అందజేస్తున్న గవర్నర్

ఆదివాసీలు కలిసికట్టుగా అభివృద్ధి సాధించాలి: మంత్రి సీతక్క

ములుగు, మార్చి 11(నమస్తే తెలంగాణ)/తాడ్వాయి : ప్రధాని మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్పానికి తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామం ఆదర్శంగా నిలువాలని దేశానికే రోల్‌మోడల్ కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. మంగళవారం తాను దత్తత తీసుకున్న కొండపర్తిలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ములుగు కలెక్టర్ టి.ఎస్. దివాకరతో కలిసి గవర్నర్ పర్యటించారు. తొలుత కొమురంభీమ్, బిర్సా ముండా విగ్రహాలను ఆవిష్కరించి బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసులను ప్రారంభించి ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రూ.7,84,700 వ్యయంతో నిర్మించిన మసాలా పౌడర్ యూనిట్‌ను, రూ.7,76,594 తో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ యూనిట్‌ను గవర్నర్ ప్రారంభించారు. అనంతరం రిమోర్టు సహాయంతో ఇందిర జలప్రభ మోటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ చిన్న గ్రామమైన కొండపర్తి అభివృద్ధిలో ఆదర్శంగా నిలువాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి సాధ్యమని గుజరాత్‌లో అమూల్ పాల ఉత్పత్తుల కేంద్రం తరహాలో కొండపర్తిలో నెలకొల్పిన మసాలా యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాక్షించారు. కొండపర్తితో రాష్ట్రంలో ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నానని, అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల అభ్యున్నతికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గవర్నర్ దత్తత తీసుకోవడంతో కొండపర్తి అభివృద్ధికి అవకాశం ఏర్పడిందని, మహిళల ఆర్థికాభివృద్ధిలో గ్రామాన్ని మోడల్‌గా నిలువాలని మంత్రి సీతక్క అన్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ ఏడు బోరు బావులు మంజూరు చేశారని, ఫలితంగా రెండు పంటలు పండే అవకాశం ఉన్నదని తెలిపారు. బాహ్య ప్రపంచంతో అనుసంధానం చేసుకుంటూ యూనిట్లలో తయారు అవుతున్న ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు ఐక్యమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నదన్నారు. దాన కిషోర్ మాట్లాడుతూ మిర్చి, పసుపు, మసాలా యూనిట్‌కు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతికి పాటుపడే సంస్థలకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రూ.కోటీ 50లక్షలతో కొండపర్తిలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. అనంతరం వనదేవతలు సమ్మక్క–సారలమ్మలను గవర్నర్ దర్శించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేడారం జాతర జరిగే తీరును అడిగి తెలుసుకొని భక్తులకు అనువైన సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తానని గవర్నర్ చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవానీ శంకర్, గవర్నర్ ఏడీసీ మేజర్ అమన్‌కుండు, సీఎస్ఓ శ్రీనివాస్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లచ్చుపటేల్ పాల్గొన్నారు.

మెరిసిన మనోళ్లు

- గ్రూప్-1లో ముగ్గురు, 2లో ఇద్దరికి ర్యాంకులు
- అభినందించిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు

శాయంపేట : తేజస్వినీరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ భాస్కర్

మేకల ఉపేందర్

ప్రవీణ్ కుమార్

పవన్ కల్యాణ్

శాయంపేట/కృష్ణకాలనీ/పాలకుర్తి/గార్ల/డోర్నకల్, మార్చి 11: ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లావాసులు మెరిశారు. గ్రూప్–1లో ముగ్గురు, 2లో ఇద్దరు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వారిని కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు. శాయంపేట మండలం మాందారిపేట గ్రామానికి చెందిన జిన్నా తేజస్వినీ రెడ్డి గ్రూప్–1లో 532.5 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకర్‌గా నిలిచారు. మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్ ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. గార్ల మండలం పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ పవన్ కల్యాణ్ గ్రూప్–1లో 454 మార్కులు సాధించాడు. ఓపెన్ కేటగిరీలో డిప్యూటీ కలెక్టర్ పోస్టు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన మేకల ఉపేందర్ గ్రూప్–1లో 423 మార్కులు సాధించాడు. ఈయన మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్ –2 ఫలితాల్లో భూపాలపల్లి మండలం ఖాసింపల్లికి చెందిన శనిగరపు ప్రవీణ్‌కుమార్ కాళేశ్వరం జోన్‌లో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 76వ ర్యాంకు సాధించాడు. ఆయన తల్లి రాధ అంగన్వాడీ హెల్పర్‌గా, తండ్రి భద్రయ్య సింగరేణిలో కాంట్రాక్టు స్పీపర్‌గా పనిచేస్తున్నాడు. బీటెక్ చదివి 2019లో పంచాయతీ సెక్రటరీ గా, 2021లో వీఆర్వోగా, గ్రూప్–4లో ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లోని జీఎస్టీ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. పాలకుర్తి మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన శివకుమార్ ఎస్సైగా మహబూబాబాద్‌లో విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్–2లో 25వ ర్యాంక్ సాధించాడు.

భూ వివాదంలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

ఆందోళనకారులను వెళ్లగొడుతున్న పోలీసులు

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

సీఐ, ఎస్సైతో పాటు పలువురికి గాయాలు

నర్సంపేట, మార్చి 11: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణం మాధన్నపేట రోడ్డులోని భూమికి సంబంధించి ఇరు వర్గాల మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, సీఐ, ఎస్సైలకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మాధన్న పేట రోడ్డు సర్వే నంబర్ 111/1/91, 111/1/92లో రామ అనసూర్యదేవి వద్ద 2019 జనవరిలో ఆరెకరాల భూమిని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, అతని స్నేహితులు ఎకరాకు రూ. 50 లక్షల చొప్పున కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ చేసుకుని రూ.1.60 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత భూమి కొలత వేయగా 3.30 ఎకరాలు మాత్రమే తేలగా, మిగిలిన నగదును రిజిస్ట్రేషన్ రోజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రొహిబిటెడ్ లిస్టులో ఉన్న భూమిని 2022లో హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి రామస్వామి ఉత్వర్వులు పొందారు. ఈ ప్రక్రియతో భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. ఆ తర్వాత రామ అనసూర్యదేవి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె వారసులైన రామచంద్రమోహన్‌తో పాటు కుటుంబ సభ్యులను అప్పట్లో సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ చేసేందుకు వారు సహకరించలేదు. 2024లో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఓర్సు తిరుపతి, పెండెం రామానంద్, పంబి వంశీకృష్ణ సదరు భూమిని మరల కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అంతేగాక కాంగ్రెస్ నాయకులు వెంచర్‌లో ప్లాట్లు చేసి అమ్మేందుకు యత్నించారు. గమనించిన రామస్వామి అతని కుటుంబ సభ్యులతో పాటు బంధువులు మంగళవారం వెంచర్ వద్దకు వచ్చి అందులోని షెడ్డును తొలగించేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓర్సు తిరుపతి, పెండెం రామానంద్, పంబి వంశీకృష్ణతో పాటు వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు రామస్వామి కుటుంబ సభ్యులు, బంధువులపై విరుచుకుపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. భూమి తమదే అంటూ గొడవకు దిగారు. పరస్పర దాడులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, టౌన్ సీఐ రమణమూర్తి, దుగ్గొండి సీఐ శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో ఖానాపురం మండలం మంగళవారిపేటకు చెందిన రామస్వామి బంధువు భూక్యా బాలకృష్ణకు తల పగలగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆందోళనకారులను అదుపుచేసేందుకు యత్నించిన సీఐ రమణమూర్తి, ఎస్సై రవికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ తర్వాత పోలీసులు ఇరువర్గాలపై లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనా స్థలాన్ని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పరిశీలించి సమస్యను కోర్టులో పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

గిరిజన యూనివర్సిటీ వీసీగా వైఎల్ శ్రీనివాస్

ములుగు, మార్చి11(నమస్తే తెలంగాణ) : సమ్మక్క–సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(ఎస్ఎస్‌సీటీయూ) తొలి వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ యెడవల్లి లక్ష్మీశ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర విద్యాశాఖ సహాయ కార్యదర్శి శ్రేయ భరద్వాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి మంజూరైన గిరిజన యూనివర్సిటీని గతేడాది ములుగు జిల్లా జాకారం వైటీసీలో ప్రారంభించగా ప్రస్తుతం వీసీని కేటాయించారు. విశిష్ట విద్యావేత్త, మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకుడిగా కొనసాగుతున్న వై.ఎల్.శ్రీనివాస్ 1984లో బీఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిట్రేషన్, పబ్లిక్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. 1986లో ఆంగ్ల విభాగంలో ఎంఏ, 1990లో ఎంఫిల్, 2007లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. హైదరాబాద్‌లోని పుల్లారెడ్డి జూనియర్ కళాశాలలో 1988లో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించి ఆ తర్వాత నోబెల్ డిగ్రీ కాలేజీ, వివేకానందవాణి, సంస్థాన్ స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, హైదరాబాద్ రామకృష్ణ మఠంలో సేవలందించారు. 1992లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకుడిగా చేరి 2021 వరకు విధులు నిర్వహించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ లిటరేచర్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.